క్లుప్తంగా

గురుపౌర్ణమి వేడుకలకు అంకురార్పణ



సాయిబాబాను దర్శించుకుంటున్న వెంకటరెడ్డి

పెదపూడి: జి.మామిడాడలోని బోడావారి వీధిలో ఉన్న అభయ గణపతి ఆలయంలో కొలువైన సాయిబాబాకు జూలై 10న గురుపౌర్ణమి సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమానికి శనివారం అంకురార్పణ చేశారు. అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు) చేతుల మీదుగా ఆలయ ప్రధాన అర్చకుడు మూర్తి.. విఘ్నేశ్వర, పుస్తక పూజలు చేసి పూజా రోజులను ప్రారంభించారు. అన్నదానానికి మొదటి చందాను ఆలయ ధర్మకర్తలు మేడపాటి రామారెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి ఉత్సవ కమిటీ కన్వీనర్ ద్వారంపూడి యువరాజారెడ్డికి అందజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్ర రెడ్డి

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్ర రెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఈ వారంలో పూర్తి చేసిన పనుల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2025 – 26లో ఉపాధి పథకంలో చేపట్టే ప్లాంటేషన్ కోసం గ్రామ పంచాయతీ తీర్మానాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కూలీలు, పనుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఉపాధి ఏపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రోత్సాహం



ఆచార్య గంటి సూర్య నారాయణమూర్తి

రాజానగరం: భారతీయ జ్ఞాన పరంపరకు సంబంధించిన పరిశోధనలకు తాము ప్రోత్సహిస్తున్నామని భారతీయ జ్ఞాన పరంపర విభాగం జాతీయ సమన్వయకర్త ఆచార్య గంటి సూర్య నారాయణమూర్తి అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో శనివారం జరిగిన జాతీయ సదస్సుకు వచ్చిన ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 అనంతరం ప్రభుత్వం భారతీయ జ్ఞాన పరంపర విభాగాన్ని ప్రారంభించిందన్నారు. ఇది ఒక సబ్జెక్టు కాదన్నారు. గడిచిన మూడేళ్లలో పరిశోధనలకు ప్రభుత్వ రూ.50 కోట్లు ఖర్చు చేసిందని, రాబోయే ఐదేళ్లకు రూ.400 కోట్లు కేటాయించిందన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పెదపూడి: నిరుద్యోగ యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇస్తున్నామని నియోజకవర్గ మైక్రోస్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఇన్‌చార్జి పి.కాశీరాణి తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంటర్‌ప్రైజెస్ కమ్ స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణను కరకుదురులో ప్రారంభిస్తారన్నారు. 18 నుంచి 58 ఏళ్ల వయసున్నవారు ఆధార్ కార్డు, ఫొటో, తెల్లరేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30న కరకుదురులో శిక్షణ కేంద్రానికి హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 90309 78888 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

బిక్కవోలు: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇలపల్లి గ్రామంలోని శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని డ్రైనేజీ, రోడ్డు శుభ్రతా పనులను ఆయన పరిశీలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోటపాడులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. మర్రిపూడి, కోటపాడు, రంగంపేట, ముకుందవరం, సుబ్రహ్మంపేట గ్రామాలలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జల్‌జీవన్ మిషన్ పథకంలో చేపట్టబోయే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, తహసీల్దార్ కోసు అనసూయ, పీఆర్ జేఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతేగా.. ఇంతేగా..



సీతానగరం - పురుషోత్తపట్నం రోడ్డుపై ఏర్పడిన గోతులు



వైఎస్సార్ సీపీ హయాంలో చక్కగా నిర్మించిన కోరుకొండ - ముగ్గళ్ల రోడ్డు

- అధ్వానంగా రహదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున హామీలు
- నమ్మి ఓట్లేసిన ప్రజలకు జలక్
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

సీతానగరం: అధికారంలోకి వచ్చాక అన్ని రోడ్లను బాగు చేస్తాం, ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. ఆ విషయాన్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు అధికారంలోకి వచ్చాక జలక్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రహదారులు ఏమాత్రం బాగుపడలేదు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏటిగట్టు రోడ్డు

సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డు రాకపోకలకు అతి ప్రధానమైంది. ఈ రోడ్డు మీదగానే పాపికొండల పర్యాటకులు వెళుతుంటారు. నిత్యం ప్రైవేటు బస్సులు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రిని భారీ వాహనాలపై ఈ దారిలోనే తరలిస్తారు. అయితే పది కిలోమీటర్ల మేర ఏటిగట్టు రోడ్డు పూర్తిగా దెబ్బ తింది. వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. గతంలో సింగవరానికి చెందిన యువకుడు స్కూటీపై వెళుతూ రోడ్డుపై పడిన గోతులను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని మృతి చెందాడు.

పాడైపోతున్న బస్సులు

ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు గోతుల్లో పాడి మరమ్మతులకు గురవుతున్నాయి. గమ్యస్థానం చేరకుండానే మధ్యలో నిలిచిపోతున్నాయి. ఇక ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు వర్ణనాతీతం. అధ్వానంగా మారిన దారిలో వాహనాలు నియంత్రణ కాక పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పది కిలోమీటర్ల రోడ్డులో ప్రయాణం దుర్భరంగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి కూటమి నాయకులు అట్టహాసంగా శంకుస్థాపన చేసి రెండు నెలలు పూర్తయినా, ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా రాజమహేంద్రవరం రూరల్ కాతేరు నుంచి సీతానగరం వరకూ నాలుగు లేన్ల రోడ్డు రఘుదేవపురం శివారు వరకూ పూర్తయ్యింది. ఎన్నికల కోడ్‌తో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల వద్ద గల కల్వర్టులను కలపాల్సి ఉండగా, ఇంత వరకూ 50 మీటర్ల రోడ్డును కూడా కూటమి ప్రభుత్వం నిర్మించలేదు. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డుపై గోతులు కూడా పూడ్చలేదు.

- ముగ్గళ్ల – కోరుకొండ రోడ్డులో ఎన్నికల ముందు గ్రామాల వద్ద సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్డుపై తారు వేయడానికి అనువుగా వెట్‌మిక్స్ వేసి చదును చేశారు. ఎన్నికల కోడ్‌తో ఆ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ పనులు చేపట్టలేదు.
- చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డు సంగతి దేవుడెరుగు, మధ్యలో అప్పన్న చావిడి వద్ద గల లోకల్వర్టులోని తూరలు పగిలిపోయి వర్షం నీరు వెళ్లడానికి మార్గం మూసుకుపోవడంతో పంటపొలాలు ముంపులోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. దీనిపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఎంప్లాయాస్, పెన్షనర్ల అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. తాత్కాలికంగా తూరలు వేయాలని కోరినా ఫలితం లేకపోయింది.

ప్రయాణం నరకం



సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ పది కిలోమీటర్ల మేరఏటిగట్టుపై ప్రయాణం నరకంగా మారింది. పంటలకు ఎరువులు తీసుకువెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. దీనికి రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసి వదిలేశారు. ఇంత వరకూ రోడ్డు పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత ఎక్కువయ్యాయి.

– మద్దంశెట్టి గాంధీ, రైతు, వంగలపూడి

కూటమి నిర్లక్ష్యం



ముగ్గళ్ల – కోరుకొండను పట్టించుకున్న నాథుడే లేడు. వైఎస్సార్ సీపీ హయాంలో మొదలైన రోడ్లు ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయి. అప్పుడు గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డులు వేశారు. అలాగే తారురోడ్డు వేయడానికి రోడ్డును సరిచేసి, వెట్‌మిక్స్ వేశారు. దానిపై తారురోడ్డు వేయడం మాత్రమే ఉంది. కూటమి ప్రభుత్వంలో దాన్ని కూడా పూర్తి చేయలేదు.

– సాది చంటిబాబు, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్, ముగ్గళ్ల

ఎన్నికల కోడ్



వైఎస్సార్ సీపీ హయాంలో రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లేన్ల రోడ్డు రఘుదేవపురం వరకూ పూర్తయ్యింది. దానిపై ప్రజలు సుఖంగా ప్రయాణం చేస్తున్నారు. మిగిలిన రోడ్డు ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయింది. అయితే కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల గ్రామాల్లో కల్వర్టుల వద్ద రోడ్డును కలపాల్సి ఉన్నా, కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. వెంటనే రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డు పనులు ప్రారంభించాలి.

– అంబటి రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మునికూడలి

ఆందోళన చేపడతాం



సీతానగరం – పురుషోత్తపట్నం, ముగ్గళ్ల – కోరుకొండ, చీపురుపల్లి – చినకొండేపూడి రోడ్ల పనులను కూటమి ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. లేకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు రోడ్డులపై పడిన గోతులను కూడా పూడ్చలేదు. వీటిపై రాకపోకలకు వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు), వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, సీతానగరం

అక్రమ కేసులపై కాదు.. పథకాలపై శ్రద్ధ పెట్టండి



రాపాకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే రాజా హితవు
- రాపాకలో 'నా కార్యకర్తలు – నా కుటుంబం'
- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడంలో చూపిస్తున్న శ్రద్ధను సూపర్ సిక్స్ పథకాల అమలుపై చూపాలని కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హితవు పలికారు. మండలంలోని రాపాకలో శనివారం 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు, మేనిఫెస్టోలో పథకాలను అమలు చేయడంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. దానికి బదులు వైఎస్సార్ సీపీ శ్రేణులపై కేసులు పెట్టడానికి మాత్రమే చంద్రబాబు, కూటమి నేతలు దృష్టి సారించారన్నారు. వారు అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తయినా, రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఒక్కటి చేపట్టలేదన్నారు.

ఆ ఘనత జగనన్నదే..

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాల హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని రాజా అన్నారు. కోవిడ్ సమయంలో రెండేళ్లు రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా, పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే లక్షన్నర కోట్ల రూపాయల వరకు అప్పులు తీసుకువచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమ్మ ఒడి పథకంలో నగదు నేరుగా తల్లుల ఖాతాలోకి వెళ్లేదని, ఇప్పుడు తల్లులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. కూటమి అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజుల వచ్చాయన్నారు. కూటమి అకృత్యాలను ఎండగట్టేలా వైఎస్సార్ సీపీ పోరాటాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పిచ్చుకుల విజయ్ కుమార్, రావూరి రామరాజు పాల్గొన్నారు.

పదవుల కోసం పార్టీ మారే వ్యక్తి నల్లమిల్లి

- రాజకీయ దిగజారుడుతనానికి బ్రాండ్ అంబాసిడర్ ఆయనే..
- వైఎస్సార్ సీపీ.. కార్యకర్తల పార్టీ
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పదవుల కోసం పార్టీ మారే వ్యక్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని, రాజకీయ దిగుజారుడుతనానికి ఆయనే బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా రాజకీయంగా నిరాశతో ఉన్న ఎమ్మెల్యే ఇప్పుడు మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అనేది నాయకుల పార్టీ కాదు, కార్యకర్తల పార్టీ అని స్పష్టం చేశారు. మా నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఎంపీ సీటుతోనే ఢీల్లీ పీఠాన్ని ఎదిరించి పార్టీని స్థాపించారన్నారు. గత ఎన్నికల్లో తాను ఓడినప్పటికీ, అది నల్లమిల్లి సొంత గెలుపు కాదని వ్యాఖ్యానించారు. మూడు పార్టీల కలిసి పోటీ చేయడం వల్ల కూటమి నెగ్గిందన్నారు. వైఎస్సార్ సీపీ ఒంటరిగా పోటీచేసి 40 శాతం ఓట్లు సాధించిన విషయాన్ని గుర్తుతెచ్చుకోవాలన్నారు. నల్లమిల్లిలో కోటి రూపాయల మట్టి తవ్వకాల్లో జరిగిన అవినీతిపై ఇప్పటికి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మా తరఫున స్థానికులు అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా, మీరు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. మీరు భయపెట్టో, ఆశ చూపించో కొంతమందిని మీ పార్టీలోకి ఆహ్వానించొచ్చు కానీ ప్రజల హృదయాలను గెలవలేరన్నారు.

వీర రాఘవరావు మాస్టారుకు అభినందన



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీఈవో వాసుదేవరావు

అనపర్తి: సమాజానికి, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే పాటల రచయితగా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీర రాఘవరావు మాస్టారును జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అభినందించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. డీఈవో మాట్లాడుతూ వీర రాఘరావు మాస్టారు తన రచనల ద్వారా మొదటిసారి తెలుగు సాహిత్య రంగంలో వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా ఏపీఎస్‌సీఇఆర్‌టీలో పాఠ్యపుస్తకాల రచయితగా, ప్రశ్నాపత్రాల రూపకర్తగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ భారతి, ఉపాధ్యాయురాలు ఏ.అరుణకుమారి పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల వెల్లువ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్ కుమార్

కోరుకొండ: ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్య కుమారి అధ్యక్షతన శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థుల సమస్యలపై సభ్యులు ప్రశ్నించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు నివేదికలను సమర్పించారు. గత రబీ సీజన్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు ఇంత వరకూ నగదు జమ కాలేదని సభ్యులు ప్రశ్నించారు. వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు మాట్లాడుతూ కోరుకొండలోని భూములన్నీ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములవ్వడంతో సుమారు 700 మంది రైతులకు అన్నదాత సుఖీభవ వర్తించదన్నారు. మండలంలో 8,900 మంది లబ్ధిదారులకు ఈ పథకం అమలవుతుందని తెలిపారు.

- పశ్చిమగానుగూడెం ఎంపీటీసీ సభ్యురాలు రొంగల లక్ష్మమ్మ మాట్లాడుతూ కొబ్బరి కాయలు కొట్టారు తప్ప, ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలన్నీ బురదమయం అవుతున్నాయన్నారు.
- కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ మాట్లాడుతూ పారిశుధ్య పనుల కోసం కార్మికులను కేటాయించాలన్నారు. ఫిల్మ్ నగర్ ప్రాంతంలో డయేరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉల్లి బుజ్జిబాబు, వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి, సర్పంచ్‌లు నక్కా రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు కాలచర్ల నాగు, గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తండ్రిని మించిన తనయుడిగా ఎదగాలి



పందలపాకలో సంతోష్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

బిక్కవోలు: దేశంలో ప్రముఖ వైద్యకళాశాల ఎయిమ్స్‌లో సీటు సాధించిన మల్లిడి సంతోష్‌రెడ్డికి శనివారం పందలపాకలోని సూరారెడ్డి నర్సింగ్ హోమ్ వద్ద అభినందన సభ నిర్వహించారు. తండ్రిని మించిన తనయుడిగా ఆయన పేరు తెచ్చుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఆ హాస్పిటల్ అధినేత డాక్టర్ కృష్ణారెడ్డి, సంధ్యాదేవి కుమారుడైన సంతోష్ రెడ్డి నీట్ ఆల్ ఇండియా స్థాయిలో 1,518 ర్యాంక్, ఎంసెట్‌లో 12 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాల రెడ్డి, పందలపాక ఉప సర్పంచి పడాల వెంకట రామారెడ్డి మాట్లాడుతూ తండ్రి అడుగు జాడల్లో నడిచి సంతోష్‌రెడ్డి మరింత ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పిల్లలను చదువు విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కానీ మార్కుల కోసం వారిపై ఒత్తిడి చేయకూడదన్నారు. తన తండ్రి సూరారెడ్డి కూడా తనను ఎంతో ప్రోత్సహించారన్నారు. కాగా.. జి.మామిడాడ, పందలపాక, కొంకుదురు, కొమరిపాలెం, తొస్సిపూడి చెందిన పలువురు నేతలు సంతోష్ రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, తొస్సిపూడి సర్పంచి కొవ్వూరి సీతారత్నం, పందలపాక మాజీ సర్పంచి సబ్బారపు సూర్యనారాయణరెడ్డి, గుణం శ్రీనువాస్ చౌదరి, ద్వారంపూడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు శాతం వడ్డీతో పరిహారం

సీతానగరం: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో భూపరిహారం తీసుకోని రైతులకు ఆరుశాతం వడ్డీతో పరిహారం అందిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం పీఏసీఎస్‌లో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ 2017లో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో భూములు అందించిన రైతులు రూ.28 లక్షలు పరిహారం తీసుకోలేదని, 2014 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం అందించాలని రైతులు కోరారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిహారం అందుకోని రైతులకు ఆరు శాతం వడ్డీతో పరిహారం అందించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఎకరానికి సుమారు రూ.40 లక్షలు చెల్లిస్తుందని తెలిపారు. సమావేశానికి హాజరైన రైతులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వీఆర్వో నందీశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్

వ్యక్తి అదృశ్యం

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన 35 ఏళ్ల రమేష్ కనిపించడం లేదని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శనివారం తెలిపారు. ఆటో నడుపుకొనే రమేష్ ఈ నెల 26 ఉదయం 8 గంటలకు లైనుకు వెళ్లుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. తన ఆటోను ఫైనాన్స్ వారికి అప్పగించి వెళ్లిపోయాడు. రమేష్ భార్య ఏడాది నుంచి పుట్టింటిలోనే ఉంటోంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆందోళన బాటలో పంచాయతీ కార్యదర్శులు



కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కోరుకొండ: పెరుగుతున్న పని ఒత్తిడిని తట్టుకోలేక పంచాయతీ కార్యదర్శులు ఆందోళనబాట పట్టారు. ఈ మేరకు శనివారం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పనిఒత్తిడిని తగ్గించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో పాల్గొనేందుకు సెలవు మంజూరు చేయాలని కోరారు. ఉదయం ఆరు గంటలకే విధుల్లో పాల్గొంటున్నట్టు ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాలనడాన్ని నిరసిస్తూ, గతంలో వలంటీర్లు చేసిన సర్వే పనులు చేయాలనడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, సురేష్ బాబు, తాతపూడి జాకబ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు నడపండి



వినతిపత్రం అందజేస్తున్న చక్రద్వారబంధం యువకులు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తమ గ్రామానికి పల్లె వెలుగు బస్సు సౌకర్యం కల్పించాలని చక్రద్వారబంధానికి చెందిన నిమ్మల ప్రభూజీ, సుంకర అశోక్, శెట్టి సత్యనారాయణ, పితాని గోవిందు తదితరులు కోరారు. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం మీదుగా మండపేట, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం గ్రామాలకు ప్రధాన రహదారులు ఉన్నాయన్నారు. అయితే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలి

సీతానగరం: వినియోగదారులు విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శామ్యూల్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు మొదట విద్యుత్ సర్వీసు తీసుకునప్పుడు అప్పటి ఉన్న లోడు ప్రకారం సర్వీస్ తీసుకున్నారన్నారు. కాలక్రమేణ ప్రతి గృహంలో ఏసీలు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు, గ్రైండర్లు, కూలర్స్ వాటర్ హీటర్లు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రస్తుతం 50 శాతం రాయితీతో విద్యుత్ ఈ అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కిలో వాట్‌కు రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందని, ఈ అవకాశం ఈ నెల 30 వరకు మాత్రమే ఉందన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల తనిఖీ



బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ సుమంత్

బిక్కవోలు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో రికార్డులను సీఐ వీఎల్‌వీకే సుమంత్ శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నిర్వహించి సాధారణ తనిఖీలలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇటీవల దేవాలయాల్లో చోరీలు, బైకుల దొంగతనాలు పెరిగాయన్నారు. వాటి నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఉన్నారు.

పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి

బిక్కవోలు: పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ పందలపాక పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్, కార్మికుడు కోసూరి శ్రీనును అదే గ్రామానికి చెందిన పినిపే రామకృష్ణ దవడపై కొట్టి, తిట్టినట్లు ఫిర్యాదు చేశారన్నారు. శ్రీను చెత్త తీయడం లేదని తరచూ పంచాయతీలో రామకృష్ణ ఫిర్యాదు చేస్తున్నాడు. దీంతో కార్యదర్శి ఆదేశాల ప్రకారం శ్రీను.. ఎస్సీపేటలో రామకృష్ణ ఇంటి వద్ద గురువారం ఉదయం చెత్త తీసుకుని ఫొటోలు తీసి, పంచాయతీ కార్యదర్శికి అప్‌లోడ్ చేశాడన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో పంచాయతీ వద్ద శ్రీను ఉండగా రామకృష్ణ వచ్చి దాడి చేశాడన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

రంగంపేట: ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పతంజలి సంస్థ అసోషియేట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) డి.రవీంద్ర సూచించారు. మండల పరిధిలోని జి.దొంతమూరు గ్రామంలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు శనివారం ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సాగులో సులభతరమైన మెళకువలు సూచించారు. మండల ఉద్యానశాఖ అధికారి ఎ.నాగ దేవిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పతంజలి సంస్థ అందిస్తున్న వివిధ రకాల రాయితీలు తెలియజేశారు. కార్యక్రమంలో పతంజలి డిప్యూటీ మేనేజర్ సీహెచ్ అనుతేజ, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, వీహెచ్‌ఏ సీహెచ్ శివ కామేష్, రైతులు పాల్గొన్నారు.